నవతెలంగాణ
ఆదిలాబాద్
ఆదివారం | అక్టోబర్ 06, 2024 | www.navatelangana.com

చీఫ్ వార్డెన్‌పై నిరాధార ఆరోపణలు

నవతెలంగాణ-ముథోల్

బాసర ట్రిపుల్ ఐటీ చీఫ్ వార్డెన్ శ్రీధర్‌పై నిరాధారణ ఆరోపణలు చేస్తున్నారరని అధ్యాపక సంఘాలు విచారం వ్యక్తం చేశాయి. ఈ మేరకు శనివారం సంఘం ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటీ ఏఓ రణధీర్‌కు వినతిపత్రం అందజేశారు. విశ్వవిద్యాలయ స్థాపన నుండి నిబద్ధతతో పనిచేస్తున్న అధ్యాపకులపై నిరాధారమైన, అవాస్తవమైన, అభియోగాలు, ఆరోపణలు రావడం అధ్యాపకుల ప్రతిష్టను దిగదార్చడమే అని సంఘం సభ్యులు కృష్ణ ప్రసాద్, సతీష్‌కుమార్, బత్తిని ఉపేందర్, సనాకుమార్, కిరణ్‌కుమార్, ఖలీల్ పేర్కొన్నారు.



మొదటి ర్యాంక్‌తో టీచర్‌గా ఎంపికవడం అభినందనీయం

నవతెలంగాణ-తాంసి

ఇద్దరు పిల్లలకు తండ్రి అయి, ఓ వైపు వ్యవసాయం చేస్తూ మరోవైపు చేనులో పండిన కూరగాయలు అమ్ముతూ ఉద్యోగానికి ఇంటివద్దనే సాధన చేసి జిల్లాలోనే మొదటి ర్యాంక్‌తో హిందీ పండిత్‌గా ఎంపికవడం అభినందనీయమని తాంసి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ ప్రధాన్ ధనుంజయ్ అన్నారు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాలలో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించి హిందీ పండిత్‌గా ఎంపికైన గిరిగామ గ్రామానికి చెందిన ప్రధాన్ సాయికృష్ణను శనివారం అఖిల భారతీయ మాలి సంఘం ఆధ్వర్యంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ గజానంద్, మాజీ ఎంపీటీసీ గంగారాం, గ్రామస్తులు కిషన్, తులసీరాం పాల్గొన్నారు.



గడ్డం వెంకటస్వామి సేవలు మరువలేనివి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- పలు చోట్ల కాకా జయంతి వేడుకలు

నవతెలంగాణ-నస్పూర్

మాజీ పార్లమెంట్ సభ్యులు గడ్డం వెంకటస్వామి అందించిన సేవలు మరువలేనివని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో వెంకటస్వామి జయంతి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్, డీఆర్‌డీఓ కిషన్‌తో కలిసి హాజరయ్యారు. వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెంకటస్వామి అందించిన సేవలు మరువలేనివన్నారు. 7సార్లు పార్లమెంటు సభ్యులుగా, 2సార్లు శాసన సభ్యులుగా ప్రజాక్షేత్రంలో ఎనలేని సేవలు అందించారని, ట్రస్టు ద్వారా బడుగు బలహీన వర్గాల ప్రజలకు సహాయ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఎడ్యుకేషన్ ట్రస్ట్ ద్వారా ఎంతోమంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించారని, ఎంతో మందికి పక్కా ఇండ్లు నిర్మించి ఇచ్చారని పేర్కొన్నారు. రాజకీయ దురంధరుడుగా ప్రజా శ్రేయస్సు, దళితులకు ఆవాసం కల్పించేందుకు కృషి చేశారని తెలిపారు. గడ్డం వెంకటస్వామి జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, మహనీయుల ఆశయాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

మందమర్రి : జీఎం కార్యాలయంలో జీఎం దేవేందర్ అధ్యక్షతన గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ అంబేద్కర్ ఎడ్యుకేషన్ సొసైటీని పబ్లిక్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌గా మార్చారని, నేషనల్ హట్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా 75,000 గుడిసె వాసులకు వసతి కల్పించడం ద్వారా 'గుడిసెల వెంకటస్వామి' అనే బిరుదును పొందారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకి విధేయుడైన వెంకటస్వామి సాధారణ కార్యకర్తగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి పెద్దపల్లి, సిద్దిపేట నుంచి లోక్‌సభ సభ్యునిగా ఏడుసార్లు ఎన్నికై రికార్డు సృష్టించారన్నారు. కేంద్ర మంత్రి వర్గంలో కార్మిక, జౌళి శాఖ మంత్రిగా, పార్లమెంటరీ డిప్యూటీ నాయకుడిగా, పార్లమెంటరీ కమిటీలలో పనిచేసినట్లు గుర్తు చేశారు. 1978-1982లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి వర్గంలో కార్మిక, పౌరసరఫరాల శాఖ మంత్రిగా పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, జీఎం కార్యాలయ ఫిట్ సెక్రెటరీ సాంబశివరెడ్డి, సిఎంఓఏఐ అధ్యక్షులు రమేష్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డివైపిఎం ఎండి ఆసిఫ్ పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

కాకా జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సిఈఆర్ క్లబ్‌లో మెగా రక్తదానం, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, సీనియర్ నాయకులు సొతుకు సుదర్శన్, మండల కాంగ్రెస్ ఇన్‌చార్జి కడారి జీవన్ కుమార్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు నెరవేట్ల శ్రీనివాస్, పట్టణ మహిళా అధ్యక్షురాలు గడ్డం రజిని, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు ఆసిఫ్ పాల్గొన్నారు.

జైపూర్ : వరుస నష్టాలతో కొనసాగిన సింగరేణి సంస్థను కాపాడింది వెంకటస్వామి అని సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్‌రావు అన్నారు. వెంకటస్వామి 95వ జయంతి వేడుకలను శనివారం పవర్ ప్లాంట్‌లో జరుపుకున్నారు. వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1957లో మొదటిసారి చెన్నూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంకటస్వామి ఆ తదుపరి పెద్దపల్లి, సిద్దిపేట పార్లమెంటు సభ్యునిగా ఏడు పర్యాయాలు గెలుపొందారని గుర్తు చేశారు. కేంద్ర మంత్రిగా, పబ్లిక్ ఎకౌంట్స్ మెంబర్‌గా కాకా దేశానికి సేవలందించారన పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ఇంతగానో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ప్లాంట్ ఓఅండ్ఎం జెఎస్ సింగ్, ఏఐటీయూ పిట్ కార్యదర్శి సత్యనారాయణ, సిఎంఓఎఐ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఏజీఎం సివిల్ ప్రసాద్, ఏజీఎం ఈఅండ్ఎం మదన్‌మోహన్, డీజీఎం పర్సనల్ అజ్మీరా తుకారాం పాల్గొన్నారు..

కాసిపేట : ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, సింగరేణి గనులపై మాజీ మంత్రి వెంకటస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీలో రోగులకు కాంగ్రెస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేక్ కట్ చేసి జయంతి నిర్వహించారు. ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో వెంకటస్వామి జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కాసిపేట గనిపై ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో కాకా జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, మాజీ సింగిల్ విండో చైర్మన్ పుస్కూరి వంశీధర్ రావు, మాజీ జడ్పిటిసి రౌతు సత్తయ్య, తహసీల్దార్ భోజన్న, కాంగ్రెస్ కార్యదర్శి మైదం రమేశ్, ముత్యాల రాజమౌళి, కాసిపేట గనిపై ఐఎన్టీయూసీ నాయకులు కాంపెల్లి సమ్మయ్య, రాపర్తి శ్రీనివాస్, బన్న లక్ష్మణ్‌దాస్, మేడ సమ్మయ్య పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్


మందమర్రి : నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


జైపూర్ : ఎస్‌టీపీపీలో..


కాసిపేట : పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

సోయా రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శనివారం భైంసా మండలం మాటేగాంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోయా కొనుగోళ్లను ప్రారంభించి మాట్లాడారు. మండలంలో 18వేల ఎకరాల్లో రైతులు సోయా పంటను సాగు చేశారని, మార్కెట్లో ధర లేకపోవడంతోనే వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి కొనుగోలు ప్రారంభించినట్లు చెప్పారు. క్వింటాల్‌కు రూ.4892 మద్దతు ధర ఉందని, 12శాతం తేమతో పంటను తీసుకొచ్చి అమ్మాలని తెలిపారు. ప్రభుత్వం ఎకరానికి కేవలం 6క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేయడంతో రైతులు సమస్యను తెలియజేయగా ఎకరానికి 10 క్వింటాళ్ల కొనుగోలు చేసే విధంగా చూస్తానన్నారు. అదేవిధంగా మాటేగాంలో మార్కెట్ కమిటీ గిడ్డంగులకు వెళ్లడానికి రహదారి సరిగ్గా లేకపోవడంతో తక్షణమే మొరం వేయిస్తానని చెప్పారు. గ్రామస్తుల సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ గంగాచరణ్, వైస్ చైర్మన్ చాకేటి లస్మన్న, పిఎసిఎస్ డైరెక్టర్లు, వ్యవసాయ శాఖ ఏడిఏ వీణ, మాజీ ఎంపీపీ రజాక్, మాజీ వైస్ ఎంపిపి నర్సారెడ్డి, నాయకులు సోలంకి భీమ్‌రావ్, పండిత్‌రావ్, తాలోడ్ శ్రీనివాస్, సిరం సుష్మారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మణరావు పటేల్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

బ్యాంక్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని టీజీబీ తాడిహత్నూర్ బ్రాంచ్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని దేవాపటార్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంక్ ద్వారా అమలు చేస్తున్న బీమా పథకాలను వివరించారు. రైతులు క్రాప్ లోన్‌లు, మహిళలు మహిళా సంఘాల రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమంలో ఎఫ్ఓ సునీల్, గ్రామ పెద్దలు సీహెచ్ జనార్ధన్, పుండలిక్, కాశీనాథ్, గోవింద్, విఠల్, సిఎస్‌సి నిర్వాహకులు రవీందర్ ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని కోకస్ మన్నూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి రైతు కాండ్లీ ముత్తన్నకు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. రైతు తెలిపిన వివరాల ప్రకారం..రోజు వారీగా చేనులోకి వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలో గేదె, కుర్ర ఒకదాని వెంట ఒకటి పరుగు తీస్తున్నాయి. గేదె బలంగా విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన గాయత్రి, వెంకట్రావు, సురేందర్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శనివారం ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అందజేశారు. వీరు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా నిధులు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా నిర్మల్ జిల్లా అధ్యక్షులు దడిగే భోజన్న, మాజీ సర్పంచ్ సత్యం, గంగాధర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో కాంస్య పతకాలు

తాండూర్ : రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో అచలాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కాంస్య పతకాలు సాధించినట్లు పీడీ సాంబమూర్తి తెలిపారు. మూడు రోజులుగా నగర్ జిల్లా ధన్వాడలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్(కుస్తీ) పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి అచలాపూర్ విద్యార్థినులు శ్రీవల్లి, ఈశ్వరి మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను హెచ్ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రయివేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్ : తప్పుడు బోనఫైడ్ జారీ చేసిన ఉట్నూర్ మండల కేంద్రంలోని సన్‌షైన్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ జి.రాహుల్ అన్నారు. శనివారం డీఈఓ ప్రణీతను కలిసి విన్నవించారు. పాఠశాలలో చదివిన విద్యార్థికి వేర్వేరు అడ్మిషన్ నంబర్లతో రెండు బోనఫైడ్‌లు జారీ చేశారని తెలిపారు. తప్పుడు రికార్డులను సృష్టిస్తున్న యాజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు సాయికుమార్, అశోక్, మస్కుల అశోక్ డిమాండ్ చేశారు.

లాభాల వాటాపై పక్కదారి పట్టిస్తున్న కొన్ని సంఘాలు

- ఏఐటీయూసీ గేట్ మీటింగ్‌లో వాసిరెడ్డి సీతారామయ్య



నవతెలంగాణ - కాసిపేట

లాభాల వాటాపై కొన్ని కార్మిక సంఘాలు కార్మికులను పక్కదారి పట్టిస్తున్నాయని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మండిపడ్డారు. శనివారం మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడారు. సింగరేణిలో 1999 నుండి లాభాల వాటా వస్తుందని, నాడు 10 శాతంగా ఉన్న లాభాల వాటా నేడు 33 శాతం వచ్చిందని కాని సింగరేణి సంస్థలో వచ్చిన లాభాల గురించి కొన్ని సంఘాలు కార్మికులను పక్కదారి పట్టిస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో కార్మికులకు రూ.2,857 కోట్లు సాధిస్తే రూ.1853 కోట్లు తీసి కార్మికులకు రూ.1003 కోట్లు చూపి 25 శాతంగా రూ.280 కోట్లు మాత్రమే కార్మికులకు ఇచ్చారని గుర్తు చేశారు. దేశంలో ఏ సంస్థలో లేని విధంగా సింగరేణి కార్మికులకు ఏఐటీయూసీ నాయకులు కేఎల్ మహేంద్ర కృషితో లాభాల వాటా సాధ్యమైందన్నారు. కొన్ని కార్మిక సంఘాలు ఈ సంవత్సరం ఇస్తున్న లాభాల వాటాపై అసత్య ప్రచారం చేస్తున్నాయని, 24 సంవత్సరాలుగా ఇచ్చిన విధంగానే ఈ సంవత్సరం కూడా లాభాల వాటా ఇవ్వడం జరిగిందని తెలిపారు. సింగరేణి సంస్థలో వచ్చిన లాభాలను నిజాయితీగా ప్రకటించిన ఘనత ఏఐటీయూసీదేన్నారు. కార్మికులకు అవాస్తవాలు చెప్పి కార్మికులను మోసం చేస్తున్న కొన్ని యూనియన్లు కార్మికులకు క్షమాపణ చెప్పాలన్నారు. దసరా పండుగ సందర్భంగా కార్మికులందరికీ స్వీట్ బాక్సులు అందే విధంగా యాజమాన్యంతో మాట్లాడతామన్నారు. అనంతరం కోల్ ఇండియా ఒడిశాలో జరిగిన ఆటల పోటీల్లో కాసిపేట-2 గనిలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ భవ్యశ్రీ పవర్ లిఫ్ట్‌లో మెడల్ సాధించిన సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, చిప్ప నర్సయ్య, రత్నం ఐలయ్య, పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, బొద్దుల వెంకటేష్, నర్సయ్య, సుభాష్ చంద్రబోస్, కమిటీ సభ్యులు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, నాయకులు రాజ కొమురయ్య, నీలయ్య, మనోజ్, సాగర్, తిరుపతి, శివగౌడ్, దేవులపల్లి శ్రీనివాస్, అరుణ్ కుమార్, అంజయ్య, కిషన్, నర్సిరెడ్డి, రత్నం రాయలింగు, అంజద్‌ఖాన్, సదానందం, గట్టు అశోక్, కోయాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంకెల గారడీతో మోసం

- టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి



నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్ర ప్రభుత్వం, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు 2023-24 ఆర్థిక సంవత్సరానికి వచ్చిన లాభాల విషయంలో సింగరేణి ఉద్యోగులను అంకెల గారడీతో మోసం చేస్తున్నారని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. శనివారం ఆర్కే-6 గని ఆవరణలో ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన నికర లాభాలు రూ.4701 కోట్లుగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సింగరేణి చైర్మన్ బలరాం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ప్రకటించారని అన్నారు. కానీ నికర లాభాలు రూ.4701 కోట్ల నుండి 33 శాతం రూ.1551 కోట్లు సింగరేణి ఉద్యోగులకు పంచాల్సి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం రూ.796 కోట్లను 16.9శాతం ఇస్తున్నారన్నారు. దీన్ని ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ వ్యతిరేకించడం మాని మద్దతు తెలుపడం విడ్డూరంగా ఉందన్నారు. మోసాన్ని గుర్తించిన టీబీజీకేఎస్ దశలవారీగా పోరాటాలు చేస్తుందని, వాటిని గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు విమర్శించడం సరికాదని అన్నారు. దీనిలో భాగంగా ఆదివారం గోదావరిఖని చౌరస్తాలో నిరసన చేపడుతున్నామని, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండి రమేష్, కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పొగాకు రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్ రెడ్డి, ముత్యాల రమేష్, డివిజన్ నాయకులు గొర్ల సంతోష్, మైపాల్ రెడ్డి, పానుగంటి తిరుపతి, మాధవరెడ్డి, ఉత్తేజి రెడ్డి, వెంకట్ రెడ్డి, మనిధర్, కిషోర్, చిప్ప రమేష్, తుర్రం శ్రీకాంత్, రాజేందర్, మధుకర్, చాట్ల రమేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతీలాల్



నవతెలంగాణ-నస్పూర్

2024-25 సంవత్సరం వానాకాలం సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు కొరకు జిల్లాలో కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతీలాల్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావుతో కలిసి కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, సిఈఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం వరి ధాన్యం కొనుగోలు కొరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సహకార సంఘాలు వారి సంఘాలలో సమావేశం ఏర్పాటు చేసుకొని కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై తీర్మానం చేసి వివరాలను అందజేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అర్హత, నిబద్ధత గల వారిని నిర్వాహకులుగా నియమించుకొని ధాన్యం కొనుగోలుకు సంబంధిత శిక్షణ అందించాలని తెలిపారు. కొనుగోలు నమోదు పుస్తకం, రిజిష్టర్‌ను కచ్చితంగా నిర్వహించాలని, ముందు వచ్చిన వారికి ముందు కొనుగోలు చేస్తూ తేమ శాతం 17కు మించకుండా నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. కొనుగోలు చేసిన వెంటనే రైతులకు రశీదు ఇవ్వాలని, గన్ని సంచులు, లారీలు పంపిన నమోదు రిజిస్టర్లు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన హమాలి చార్జీలను చెల్లించాలని తెలిపారు. దొడ్డు రకం, సన్నరకం ధాన్యం కొనుగోలుకు వేరువేరు స్థలాలను(దూరంగా) ఒకే సెంటర్‌లో కేటాయించాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే సదరు నిర్వాహకులపై చట్ట ప్రకారం సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఐటీఐలో జాబ్‌మేళాకు స్పందన

ఆదిలాబాద్‌టౌన్ : దుబాయిలో డెలివరీ బాయ్స్ కోసం ఎంప్లాయిమెంట్ కార్యాలయం నేతృత్వంలో నిర్వహించిన జాబ్ మేళకు స్పందన వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో కొనసాగే టాంకం కంపెనీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. కంపెనీ జాయినింగ్ మేనేజర్ రితీష్ అభ్యర్థుల సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు పరిశీలించి పని చేయాల్సి స్థలం, వేతనం తదతర వాటి గురించి తెలియజేశారు. ఈ నెల 10న అభ్యర్థులకు హైదరాబాద్‌లోని తమ కంపెనీలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఇండియా లైసెన్స్ కలిగిన వారికి అక్కడ నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందని, దుబాయి లైసెన్స్ ఉన్న వారికి ఎలాంటి శిక్షణ ఉండదని తెలిపారు. నెలకు దాదాపు రూ.65వేల వరకు సంపదిస్తారన్నారు. యువత ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ మేళాలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ రొడ్డ శ్రీనివాస్, ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గోవర్ధన్, కంపెనీ కోర్సు కోఆర్డినేటర్ అనిల్ ఉన్నారు.



ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని రామ్‌నగర్‌కు చెందిన కవన కోకిల జాదవ్ బంకట్ లాల్ రచయిత కుమార్తె సాయిప్రియ ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. దీంతో శనివారం శ్రీ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు జాదవ్ వసంతరావు, ప్రధాన కార్యదర్శి చవాన్ సేవాదాస్‌లు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ గిరిజనులు తమ అమ్మాయిలను ఉన్నత చదువు వైపు ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. గిరిజన ఆడపిల్లలు ఉన్నతంగా చదువుకొని తమ తల్లిదండ్రుల కలలను నిజం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసేవా ఫౌండేషన్ సభ్యులు బానోత్ రవీందర్, కుటుంబ సభ్యులు ఉన్నారు.



కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో లక్కారం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి ఆయన సతీమణితో పాటు పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరి, బీఆర్ఎస్‌కు బిగ్‌షాక్ ఇచ్చారు. శనివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారని తెలిపారు. పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



పొగాకు రహిత సమాజాన్ని నిర్మించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతి ఒక్కరూ పొగాకు రహిత సమాజాన్ని నిర్మించడానికి కృషి చేయాలని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. శనివారం పట్టణంలోని పలు దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ యువత పొగాకు ఉత్పత్తులకు ఎక్కువగా అలవాటు పడుతున్నారని తెలిపారు. పొగాకు ఉత్పత్తుల వాడకం వలన కలిగే అనర్థాలపై యువత అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల నుంచి దూరంగా ఉండాలంటే పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని మానేయాలని తెలిపారు. సిగరెట్లు తాగడం, గుట్కా, ఖైని, అంబర్ లాంటి పదార్థాలు వాడటం వలన నోటిక్యాన్సర్‌తో పాటు అనేక ఇతర సమస్యలు వస్తాయని తెలిపారు. మైనర్లకు పొగాకు ఉత్పత్తులు అమ్మడం వారిచే అమ్మించడం కోట్పా చట్టం ప్రకారం నేరమని తెలిపారు. ఎవరైనా మైనర్లకు పొగాకు ఉత్పత్తులు అమ్మితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ పిల్లలు ఎవరైనా పొగాకు ఉత్పత్తులు వాడినట్లు తల్లిదండ్రులు గుర్తిస్తే తమ దగ్గరలోని మానసిక నిపుణుల వద్దకు తీసుకువెళ్లాలని సూచించారు. 14416 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఉచిత కౌన్సిలింగ్ సహాయం పొందవచ్చని తెలిపారు. ఆయన వెంట జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ విభాగం ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ వెంకటరమణ, శ్రీనివాస్, సోషల్ వర్కర్ చిరంజీవి ఉన్నారు.

తెలంగాణ సంస్కృతికి అద్దం.. బతుకమ్మ పండగ..

నవతెలంగాణ-నార్నూర్

తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పండగ బతుకమ్మ పండగ అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట కేశవులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో అధ్యాపకులు విద్యార్థులతో కలిసి బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు ఉదయాన్నే రకరకాల పూలు తీసుకొచ్చి, బతుకమ్మని పేర్చి పూజలు చేశారు. తెలంగాణ సంస్కృతిని అద్దం పట్టే విధంగా విద్యార్థులు నృత్యం చేశారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ జీవన విధానంలో నూతన ఉత్తేజం కలుగజేసే పండుగ అని, ఇది ప్రకృతితో అనుసంధానపరిచే పండుగ అని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతిక విలువలను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కాంబ్లె బాలాజీ, అధ్యాపక బృందం లింగంపల్లి సుజాత, దోమకొండ సుజాత, కే.వెంకటరమణ, ఉదయ్ కుమార్, చెదల నరేష్, సీహెచ్ పుష్ప, సీహెచ్ జలంధర్, పి.గజానంద్, ఆడే కృష్ణవేణి, సీహెచ్ రుక్మిణి విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని కలెక్టర్ రాజర్షిషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయివేట్ స్థలాలలో నిర్మాణాలు చేపట్టే వారు రెవిన్యూ, పంచాయతీ, మున్సిపల్ అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకున్న తరువాతనే నిర్మాణాలు చేపట్టాలని, అలా అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి లేదా మున్సిపల్, గ్రామ పంచాయతీలలో ఉన్న ఖాళీ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని పేర్కొన్నారు. ఇంద్రవెల్లి మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణం చేసిన ఇండ్లతో పాటు మండలకేంద్రంలో అనుమతి లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. రెవిన్యూ, పోలీసు, పంచాయతీ అధికారులు సంయుక్తంగా పరిశీలించి, ముందస్తు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం జరిగినందున ఇంద్రవెల్లిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశామని పేర్కొన్నారు.

గోండ్ వీరనారి రాణిదుర్గావతి జయంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో వనవాసి కళ్యాణ పరిషత్ శిక్షణ కేంద్రంలో శనివారం కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో గోండ్ వీరనారి రాణీ దుర్గావతి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర నిర్వాహకులు మోర మహేష్ మాట్లాడుతూ రాణి దుర్గావతినీ ఆదర్శంగా తీసుకొని నేటి మహిళలు యువతీ, యువకులు ముందుకెళ్లాలని సూచించారు. ఎటువంటి ఆపదలు వచ్చినా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు కడెం విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి సయ్యద్ ఫర్జాన్ అండర్-14 బాలుర రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బి.వెంకటరమణ శనివారం తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన జోనల్ స్థాయి క్రికెట్ పోటీలలో ఫర్జాన్ ఆల్ రౌండ్ ప్రదర్శనతో మంచి ప్రతిభ కనబర్చి ఈ నెల14 నుంచి17 వరకు జోగులాంబ గద్వాల ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జోనల్ స్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

గ్రామాల్లో నిర్వహించే వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు ప్రజలను కోరారు. శనివారం మండలంలోని ఖంపూర్, ఖాతిగూడలో వైద్యసిబ్బందితో వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ముందు జాగ్రత్తగా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్లు చౌహాన్ చరణ్‌దాస్, గణేష్ కుమార్ జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారికి వైద్య పరీక్షలు చేసి, ఉచిత మందులు పంపిణీ చేశారు. గ్రామంలో పరిసరాలను, నీటి ట్యాంక్ ను పరిశీలించారు. టైర్లలో ఖాళీ డబ్బాలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. పరిసరాల్లో చెత్త చెదారం లేకుండా ఉంటే దోమలు వృద్ధి కావని ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది హిమబిందూ, మాన్యుబాయి, ఈశ్వరి, పంచాయతీ కార్యదర్శి కాశీరాం, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీ, ఆశా రంభబాయి ఉన్నారు.

ఆర్పీల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్పీల సమస్యలు పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. శనివారం పట్టణంలోని గాంధీపార్క్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ మెప్మా రిసోర్స్ పర్సన్స్ ఆర్పీ యూనియన్ వారు మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఆర్పీలు సీఐటీయూ సంఘంలో చేరారు. వారికి కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ ఆర్పీలకు ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ దాకా జిల్లాలో ఆరు నెలల వేతనాలు చెల్లించలేదని అన్నారు. బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నెలకు అతి తక్కువ వేతనం రూ.ఆరు వేలు ఇస్తున్నారని, నేరుగా ఆర్పీల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలలో జమ చేయాలన్నారు. కానీ సమైక్య అకౌంట్లో జమచేసి, అనేక రకాల ఇబ్బందులు పెట్టి వేతనాలు ఇస్తున్నారని అన్నారు. జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. ఆర్పీలకు రాష్ట్రవ్యాప్తంగా ఒకే యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. రూ.10లక్షల సాధారణ భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 92 మంది పనిచేస్తున్నారని అన్నారు. వీరు టీవీఏఫ్‌లకు బుక్ కీపింగ్, మహిళలకు బ్యాంకు రుణాలు, శ్రీనిధి నుంచి రుణాలు ఇప్పిస్తున్నారని అన్నారు. అదేవిధంగా రుణాలను సకాలంలో చెల్లించేలా చూస్తున్నారని తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ సర్వే, అనాథ పిల్లల సర్వే, బతుకమ్మ చీరల పంపిణీ తదితర సంక్షేమ పథకాలు అమలుకు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. పట్టణంలో మహిళల అభ్యున్నతికి పనిచేస్తున్న ఆర్పీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేనిచో రాబోయే కాలంలో దశలవారీగా ఆందోళనకు సిద్ధమవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, అగ్గిమల్ల స్వామి, సహాయ కార్యదర్శి ఎస్ నవీన్ కుమార్, ఆర్పీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఆత్మకూరు పద్మ, కుమ్ర ధనలక్ష్మి, కోశాధికారి బొల్లు రేవతి, ఉపాధ్యక్షులు మంజుల, శ్రీవాణి పాల్గొన్నారు.

వీసీపై దృష్టి మళ్లించడానికేనా..?

నవతెలంగాణ-ముధోల్

బాసర ట్రిపుల్ ఐటీలో గత మూడు రోజులుగా ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణపై తీవ్రమైన ఆరోపణలు రావడంతో ఈ విషయం కలకలం సృష్టించిన విషయం అందరికీ తెలిసిందే. అయితే వీసీ విషయాన్ని పక్కదారి పట్టడానికి చీఫ్ వార్డెన్ శ్రీధర్ పై నేపం నేడుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. నిన్న ట్రిపుల్ ఐటీని ఎస్సీ, ఎస్టీ కమిషన్ తనిఖీ చేశారు. చీఫ్ వార్డెన్‌పై కావాలని కొంతమందిపై నిందలు మోపి, సామాజిక మాధ్యమాల్లోకి వదిలారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చీఫ్ వార్డెన్‌కు ట్రిపుల్ ఐటీ తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ సంఘం (టిఎస్ఎఎస్) మద్దతు తెలుపుతూ శుక్రవారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. చీఫ్ వార్డెన్ తన ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన అనంతరం కేర్ టేకర్లను నియమించాలని లిఖితపూర్వకంగా తెలియజేసిన ఎవరు పట్టించుకోలేదని విద్యార్థులు ఆ ప్రకటనలు ఆరోపించిన విషయం తెలిసిందే. ట్రిపుల్ ఐటీ వీసీ వెంకటరమణ పై నుంచి దృష్టి మళ్లించడానికి వార్డెన్‌ను బలి చేస్తున్నారని సంఘం సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వీసీపై తీవ్రమైన ఆరోపణలు గత మూడు రోజులుగా సామాజిక మధ్యమాల్లో, మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. వీసీ వ్యవహారాన్ని పలువురు తప్పు పట్టారు. అయితే ఈ విషయాన్ని పక్కదారి పట్టించడానికి ఓ బాస్ ఆడిన నాటకమే వార్డెన్ కథ అని పలువురు పేర్కొంటున్నారు. వార్డెన్‌కు ట్రిపుల్ ఐటీ విద్యార్థి సంఘమే కాకుండా, కొంతమంది ట్రిపుల్ ఐటీ ఉద్యోగులు కూడా మద్దతుతో పాటు అండగా ఉంటామని అన్నారు. ఏది ఏమైనా వీసీ పై వచ్చిన ఆరోపణలను మరుగున పడేయడానికి ఈ కథ అల్లారని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా తనపై వచ్చిన తీవ్రమైన ఆరోపణలపై వీసీ సమాధానం చెప్పే వరకు సందిగ్ధత వీడే అవకాశాలు కనిపించడం లేదు.



కార్మికులు సంక్షేమానికి కేంద్ర మాజీ మంత్రి కృషి

- కలెక్టరేట్‌లో అధికారికంగా కాకా జయంతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేదలతో పాటు కార్మికులు సంక్షేమానికి కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి ఎంతో కృషి చేశారని, ఆయన స్ఫూర్తితో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అందేలా అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం కలెక్టరేట్ లో కాకా జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్యామలదేవితో కలిసి కాకా చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడుతూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో పేదల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు సింగరేణి ప్రాంతంలోని కార్మికుల సంక్షేమానికి కృషి చేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆయన స్ఫూర్తితో అనేక పథకాలను పేదల కోసం తీసుకువచ్చిందన్నారు. వాటి గురించి ప్రజలకు తెలియజేయడంతో పాటు వాటిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అలాగే ఫ్యామిలి డిజిటల్ కార్డుల జారీ సర్వేపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఏఓ రామిరెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

పేదవారికి సొంత ఖర్చులతో గుడిసెలు కట్టించి, గుడిసెల వెంకటస్వామిగా పేరు తెచ్చుకున్న మహనీయుడు దివంగత కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి అని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ అన్నారు. శనివారం కాక జయంతి వేడుకలను ప్రజాసేవ భవన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆవుల వెంకన్న, రామ్‌కుమార్, నాయకులు పోరెడ్డి కిషన్, రఫీక్, రాజేశ్వర్, ఎంఏ ఖయ్యుం, ఎల్మా రాంరెడ్డి పాల్గొన్నారు.

లోకేశ్వరం : కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడ్డం వెంకట స్వామి జయంతిని శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎంపీడీఓ వెంకట రమేష్ అధికారులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనేక కార్మిక ఉద్యమాలలో ఆయన ప్రత్యక్షంగా పోరాటం చేశారని బడుగు బలహీన వర్గాల ప్రజల్లో వెలుగులు నింపిన వ్యక్తి కాకా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సోలమన్‌రాజ్, పంచాయతీ కార్యదర్శులు గంధం వినయ్ సాయి, గంగాధర్, టీఏ లు రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే సహించేది లేదు

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

నవతెలంగాణ-కుభీర్

రైతులను దళారులు, అధికారులు ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శనివారం వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోయ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మహారాష్ట్రకు చెందిన దళారులు కొందరు ఇక్కడి రైతుల పేరు మీద ధాన్యాన్ని విక్రయిస్తున్నారని అన్నారు. దీంతో ఇక్కడి రైతులు నష్టపోతున్నారని అన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే పంటను అమ్ముకోవాలని అన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇప్పటి వరకు కనీసం 35 శాతం మంది రైతులకు కూడా చేయలేదని మండిపడ్డారు. ఈ విషయమై ఇటీవల హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఆరుగురు ఎమ్మెల్యేలు, ఎంపీలు కలిసి నిరాహార దీక్ష చేసినట్టు గుర్తు చేశారు. రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేసేంత వరకు రైతుల పక్షాన పోరాటాలు చేస్తామని అన్నారు. ఎకరానికి 6క్వింటల కొనుగోలు చేస్తామని, అధికారులు చెప్పడంతో, రైతులు పది క్వింటాళ్ల వరకు సోయను కొనుగోళ్లు చేపట్టాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయన సానుకూలంగా స్పందిస్తూ కేంద్ర మంత్రులతో మాట్లాడి త్వరలో నిర్ణయం తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. సోయకు క్వింటాల్‌కు రూ.4,892 మద్దతు ధర ప్రభుత్వం చెల్లిస్తుందని, కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ రేకుల గంగాచరణ్, మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి ప్రవీణ్‌రెడ్డి, తహసీల్దార్ సోము, ఎంపీడీఓ నవనీత్ కుమార్, సహకార సంఘం కార్యదర్శి క్రాంతి కుమార్, మార్కెట్ కార్యదర్శి గంగన్న, నాయకులు ఏశాల దత్త్రాతి, నగేష్, బంక బాబు, నాగేందర్, కనకయ్య, బషీర్, వైస్ చైర్మెన్ రమేష్, వ్యాపార వేత్త రఫీక్, రైతులు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



మాల సంఘ భవనాలకు నిధులు మంజూరు చేయాలి



నవతెలంగాణ-నేరడిగొండ

మాల సంఘ భవనాలకు నిధులు మంజూరు చేయాలని శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలకు మాల సంఘ భవనాల నిర్మాణానికి నిధులు, అర్హులైన మాల కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సానుకూలంగా స్పందించి, తప్పకుండా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు ఎలుక రాజుతో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం యూనియన్ ఆధ్వర్యంలో 2019 అక్టోబర్ 5న కార్మికులు చేసిన సమ్మెలో అమరులైన వారికి బస్ డిపో ఎదుట నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ బస్సులను ఆర్టీసీ సంస్థనే సొంతంగా నడపాలని అన్నారు. మహాలక్ష్మి స్కీంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలన్నారు. సీసీఎస్ ఎన్నికలు జరపాలని అలాగే యూనియన్‌లను వాటి కార్యక్రమాలను అనుమతించాలని పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మెటిపెల్లి భీంరావు, రీజియన్ అధ్యక్షులు ఎస్.భీమ్‌రావ్, డిపో కార్యదర్శి ముత్యాల ఆశన్న, వెంకటి, రమేష్, విఠల్ ఎస్ఏ ఖాన్, ఫహీమ్ ఉన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు సహకారం అందిస్తాం

- కబడ్డీ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లాలో కబడ్డీ క్రీడను అభివృద్ధి పరిచేందుకు మరింత కృషి చేయడంతో పాటు క్రీడాకారులకు అన్ని రకాల సహకారం అందిస్తానని కబడ్డీ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ఉష్కం రఘుపతి అన్నారు. శనివారం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. అసోసియేషన్ చీఫ్ పాటర్న్‌గా ఎంపీ గోడం నగేష్, చైర్మెన్ ఎమ్మెల్యే పాయల శంకర్‌లతో పాటు అధ్యక్షుడిగా రఘుపతి, ప్రధాన కార్యదర్శిగా జబాడే రాష్ట్రపాల్, కోశాధికారిగా జంజర్ల సాయికుమార్‌ను ఎన్నుకున్నారు. కాగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, గిరిజన క్రీడలాభివృద్ధి అధికారి పార్థసారథి, నూతన కమిటీ సభ్యులను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఉష్కం రఘుపతి మాట్లాడుతూ గ్రామీణ క్రీడగా ప్రాచుర్యం పొందిన కబడ్డీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో క్రీడకారులకు మరింత నాణ్యమైన సౌకర్యాలతో పాటు ఇతర వసతులను కల్పించేలా చూస్తామన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడకారులను తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ అబ్జర్వర్ రామచందర్, జిల్లా క్రీడ ప్రాధికార సంస్థ అబ్జర్వర్ రజియోద్దిన్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేసి మాదిగ ఉపాకులలకు విద్య ఉద్యోగ రంగాలలో న్యాయం జరిగే విధంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మాదిగ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిపెల్లి నాగన్న అన్నారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణపై అభిప్రాయాలు స్వీకరిస్తున్నందున్న తక్షణమే అమలు చేయాలన్నారు. మాదిగ ఉపకులాల ప్రజలు, మెయిల్ ద్వారా లెటర్స్ ద్వారా హైదరాబాద్ లోని దామోదర సంజీవయ్య భవన్ అడ్రెస్సుకు పంపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు మల్యాల మనోజ్, నక్క రాందాస్, కత్తి గంగాధర్, గజ్జెల విలాస్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-సిరికొండ

డిగ్రీ నవంబర్ 2021 లోపు పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ రాబోయే ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయాలంటే తప్పనిసరిగా ఓటును ముందు నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మెమో, ఓటర్ ఐడీ కార్డ్, పాస్ ఫోటో, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్, ఈ మెయిల్ ఐడీలను తీసుకొని సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రారంభమైన గంగనీళ్ల జాతర

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ అడెల్లి మహా పోచమ్మ గంగనీళ్ల జాతర శనివారం ప్రారంభమయ్యింది. ఆలయం నుంచి అమ్మవారి నగలతో సేవాదారులు భక్తులు పాదయాత్రగా పోలీస్ బందోబస్తు నడుమ అడెల్లి, సారంగాపూర్, యకరపల్లె, వంజర్, ప్యాముర్, మాటేగం, దిలావర్‌పూర్, బన్సపల్లి, కంజర్, మల్లాపూర్ మీదుగా సాంగ్వి గ్రామాన గల గోదావరి నదికి బయలు దేరివెళ్లారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | అక్టోబర్ 06, 2024 | www.navatelangana.com

ఎల్‌ఆర్‌ఎస్ సర్వే గడువులోపు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ఎల్‌ఆర్‌ఎస్ సర్వే నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శనివారం కాగజ్‌నగర్ మండలంలోని ఎన్‌జీఓ కాలనీలో నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో నిర్దేశించిన అన్ని అంశాలను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, మండల అభివృద్ధి అధికారి, పంచాయతీ సెక్రటరీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణం నౌగాం బస్తిలోని ఓ ఇంటిలో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు శనివారం టౌన్ సీఐ తుత్తూరు శంకరయ్య ఆదేశాల మేరకు టౌన్ ఎస్ఐ సుధాకర్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. మొహమ్మద్ హనీఫ్ ఇంట్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని మొహమ్మద్ హనీఫ్, మొహమ్మద్ లతీఫ్, షేక్ రియాజ్, బండ పరమేశ్వర్, చిలుమల వేంకటస్వామిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.13,070 నగదుతో పాటు ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు సీఐ శంకరయ్య వెల్లడించారు. సందర్భంగా సీఐ మాట్లాడుతూ కాగజ్‌నగర్ టౌన్‌లో పేకాట, జూదం ఆడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆస్పత్రిలో మందుల కొరతపై విచారణ జరపాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిలో మందుల కొరతపై విచారణ జరపాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో మందుల కొరత ఉందన్నారు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఆస్పత్రిలో ఉండాల్సిన కనీస వసతులు కూడా లేకపోవడంతో జిల్లాలోని ఇతర ప్రాంతాల నుండి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే మందుల కొరతపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కార్తీక్, రాజేందర్ పాల్గొన్నారు.

యుక్తవయసు ప్రధానమైంది : డీసీపీఓ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మనిషి జీవితంలో యుక్త వయసు ఎంతో ప్రధానమైందని జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ అన్నారు. మండలంలోని బూరుగుడ గ్రామపంచాయతీలో యుక్త వయసు బాలికల సంరక్షణ విషయంలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుక్త వయసు బాలికల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమాజంలో బాలికలపై అఘాయిత్యాలు ఎక్కడో ఒక చోట రోజు జరుగుతూనే ఉన్నాయని దీనికి ప్రధాన కారణం విచ్చలవిడిగా మొబైల్ ఫోన్ల వాడకామన్నారు. పిల్లల పట్ల తల్లితండ్రుల నియంత్రణ లేమి, సమాజంలో వ్యక్తులను గుడ్డిగా నమ్మడం లాంటివన్నారు. ఏదైనా ప్రమాదం జరుగుతుందని గ్రహిస్తే వెంటనే అప్రమత్తమై 100, 1098 లాంటి టోల్ ఫ్రీ నెంబర్లకు సంప్రదించి సాయం పొందాలన్నారు. బాలికల చదువుతో పాటు సామాజిక విలువలు, జీవన నైపుణ్యాలు పిల్లలకు అలవాటు చేయాలని తల్లితండ్రులు, పోషకులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శ్రీలత గౌడ్, సూపర్‌వైజర్ లైలా, ఎంఎల్‌హెచ్‌పీ సువర్ణ, బాల రక్షా భవన్ సిబ్బంది చంద్రశేఖర్, బాల ప్రవీణ్, డోంగ్రే ప్రవీణ్, రవళి, సుగుణ, శకుంతల, ఝాన్సీ రాణి, సుకన్య ఉస్మాన్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, కిశోర బాలికలు, తల్లితండ్రులు, పోషకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆరె కుల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలనీ ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరాం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో సంఘ సభ్యులు, కుల యువతతో కలిసి ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రాల జారీ, వర్తింపుపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరె కులస్థులకు ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలను జారీ చేయడంలో తహసీల్దార్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దీంతో ఉద్యోగాలకి ఎంపికైన ఆరె కుల అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ జాబితాలో లేని తమకు ఈడబ్ల్యూఎస్ జారీ చేయడంలో అలసత్వం వహించడం సరికాదన్నారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో తమ కులానికి చెందిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన విషయంలో ఇబ్బందులకు గురిచేశారన్నారు. చట్ట ప్రకారం తమకి ఈడబ్ల్యూఎస్ వర్తిస్తుందన్నారు. తమ అభ్యర్థులు అందరిలాగానే తహసీల్దార్ కార్యాలయం నుండి ధ్రువీకరణ పత్రాలు పొందారని కానీ ఓ వర్గానికి చెందిన కొందరు ఆరె కులస్థులకు ఈడబ్ల్యూఎస్ వర్తించదని వారిని డీఎస్సీలో తిరస్కరించాలని కోరగా వారి ఫిర్యాదు మేరకు అధికారులు ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డీఎస్సీలో తమ అభ్యర్థులకు అన్యాయం జరిగితే సహించేదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరె కులస్థులందరూ కలెక్టరేట్ ముట్టడిస్తామని ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అరె సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వాసు పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్‌పల్లి దాదారం, డివిజన్ అధ్యక్షుడు బోర్కుటే తిరుపతి, ఉపాధ్యక్షుడు బొట్టుపల్లి అన్నారావు, ప్రధాన కార్యదర్శి నాగపూర్ మారుతి కోశాధికారి ఎలుములే దిలీప్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు గెడేకార్ సంతోష్, కౌటల అధ్యక్షుడు ధనుర్కార్ వసంత్, సాండ్గం మాజీ సర్పంచి ఎకొంకర్ దామోదర్, సంఘ నాయకులు కురాట్ కార్ రమేష్, ఎల్ములే మనోహర్, లోనరే కిరణ్, కిర్మరే శ్రీకాంత్, తరుణ్ పాల్గొన్నారు.

శారద గణేష్ మండలి వద్ద అన్నదానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని బాపునగర్ శారద గణేష్ మండలి వద్ద నిర్వాహకులు శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. శనివారం వారసంత కావడంతో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమానికి భక్తులు వచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘం రైతు అధ్యక్షుడు మారుతి పటేల్, ఇతర నాయకులు నిర్వాహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎఫ్డీసీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

- ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ఇల్లంబర్తి



సర్వే బృందాలకు సూచనలు చేస్తున్న ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ఇల్లంబర్తి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు(ఎఫ్డీసీ) పైలెట్ ప్రాజెక్టు సర్వే ప్రక్రియ వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి, రవాణా శాఖ కమిషనర్ కె.ఇల్లంబర్తి అన్నారు. శనివారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి. కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేపై తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంబంధించిన కుటుంబ సభ్యుల వివరాలు ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలన్నారు. ఇంటి యజమానురాలిగా మహిళ పేరు నమోదు చేసి తర్వాత కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలని సూచించారు. ఒక కుటుంబానికి ఒక కార్డు ఉంటుందని, కుటుంబంలోని ప్రతి సభ్యుడికి ఒక ప్రత్యేక నంబర్ కేటాయించడం జరుగుతుందని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అన్నింటికీ ఒకే కార్డు అనుసంధానమై ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం అందించనున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు వివిధ సంక్షేమ పథకాలకు ఉపయోగపడుతుందని, ప్రతి ఇంటికెళ్లి సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వే పూర్తయిన తర్వాత ఈ నెల 9న నిర్ణీత ప్రొఫార్మాలో అవసరమైన నివేదికను పంపించాలని సూచించారు. ఇప్పటికే జరుగుతున్న సర్వేకు సంబంధించిన సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ లోకేశ్వరరావు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య, సర్వే బృందం సభ్యులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా స్థాయిలో సత్తా చాటాలి

- బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్

నవతెలంగాణ-రెబ్బెన

ఉత్తమ క్రీడా ప్రతిభతో కోల్ ఇండియా స్థాయిలో సత్తా చాటాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం డబ్ల్యూపీఎస్, జీఏ 91వ వార్షిక క్రీడా పోటీలలో భాగంగా గోలేటిలోని శ్రీ భీమన్న మైదానంలో డిపార్ట్మెంటల్ హాకీ పోటీలను ఆయన ముఖ్య అతిదిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జాతీయ క్రీడా హాకీ ప్రపంచంలోనే అత్యంత ప్రజాధరణ పొందిందన్నారు. గెలిచిన వారు మరింత నైపుణ్యాన్ని పెంచుకోవాలని, ఓడిన వారు నిరుత్సాహ పడకుండా తప్పులను సవరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీటీయూసీ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఎస్ఓ టూ జీఎం రాజమల్లు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, ఎస్ఈ మదీనా బాషా, ఎన్విరాన్మెంట్ అధికారి రమేష్, సీనియర్ పర్సనల్ అధికారి డి ప్రశాంత్ పాల్గొన్నారు.



హాకీ ఆడుతున్న జీఎం ఎం. శ్రీనివాస్, సింగరేణి అధికారులు

గ్రామాల వరకు స్వచ్ఛత కొనసాగాలి

స్వచ్ఛత వ్యక్తిగతంగా మొదలై కాలనీలు, గ్రామాల వరకు కొనసాగాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛత పక్వాడ స్పెషల్ కాంపెయిన్ 4.0 కార్యక్రమంలో భాగంగా జీఎం ఎం.శ్రీనివాస్ ఏరియా అధికారులతో కలిసి గోలేటిలోని శ్రీ భీమన్న మైదానంలో శనివారం స్వచ్ఛత పనులు చేశారు. పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివ్యక్తి రోజులో గంట సమయం స్వచ్ఛత పనులకు కేటాయించాలని సూచించారు. శ్రీ భీమన్న మైదానంలో నడక దారి వెంట ఉన్న గడ్డి మొక్కలను పూర్తి స్థాయిలో తొలగించి సుందరంగా తీర్చిదిద్దాలని సివిల్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏబీటీయూసీ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఎస్ఓ టూ జీఎం రాజమల్లు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, ఎస్ఈ మదీనా బాషా, ఎన్విరాన్మెంట్ అధికారి రమేష్, సీనియర్ పర్సనల్ అధికారి డి ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ అభివృద్ధి సంస్థ పురోగతికి చర్యలు

- టీజీ ఎఫ్‌డీసీ చైర్మన్ పొదెం వీరయ్య
- కాగజ్‌నగర్ డివిజన్ నూతన కార్యాలయ ప్రారంభం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) పురోగతి కోసం మెరుగైన ప్రణాళికలతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఆ సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. శనివారం కాగజనగర్‌లోని బస్టాండ్ ఎదురుగా తెలంగాణా అటవీ అభివృద్ధి సంస్థ కొత్తగా నిర్మించిన డివిజన్ కార్యాలయ భవన సముదాయాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీజీ ఎఫ్‌డీసీ లాభాల బాటలో పయనిస్తోందన్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిసర అటవీ ప్రాంతాల్లో ఏకో టూరిజం ద్వారా టీజీ ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా టీజీ ఎఫ్‌డీసీలో సిబ్బంది కొరత ఉందని, ఈ ఉద్యోగాల భర్తీ కోసం సీఎంతో మాట్లాడి చర్యలు తీసుకుంటానన్నారు. డివిజన్ కార్యాలయం ప్రారంభం సందర్భంగా కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీజీ ఎఫ్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్ డి.వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ డాక్టర్ జి.స్పైలాబ్, డివిజనల్ మేనేజర్ శ్రావణి, ఎస్పీఎం జీఎం నర్కడే, ప్లాంటేషన్ మేనేజర్లు ఈ.లక్ష్మణ్ (కాగజ్‌నగర్ రేంజ్), జి.సురేష్ కుమార్ (మంచిర్యాల రేంజ్), వి.సునీత (బెల్లంపల్లి రేంజ్), డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ డి. రాకేష్, డివిజన్ కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ సూపర్‌వైజర్, వాచర్‌లు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలు కొనసాగించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాల్సిన అవసరముందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయంగా ప్రజలకు ఎంతో సేవ చేసిన మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి ఏడుసార్లు ఎంపీగా గెలవడం ప్రజల ఆశీర్వాదాలు తెలియజేస్తుందని తెలిపారు. ప్రజలు ఆప్యాయతతో ఆయనను కాక అని పిలిచే వారని అదే ప్రస్తుతం కూడా కొనసాగుతుందన్నారు. అటువంటి మహనీయుల ఆశయాలను కొనసాగించే విధంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి, అడిషనల్ డీఆర్‌డీఓ రామకృష్ణ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : కాకా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ

డీపీఓ కార్యాలయంలో...

మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను డీపీఓ కార్యాలయంలో ఎస్పీ డీవీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటస్వామి తెలంగాణ రాష్ట్ర తొలి, మలి ఉద్యమాలలో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో సీఐలు రాణాప్రతాప్, పెద్దయ్య, అంజన్న, మార్కండేయ, హరినాథ్, కేశవులు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రెబ్బెన: కాకా చిత్రపటానికి పూలమాల వేస్తున్న జీఎం

రెబ్బెన : బెల్లంపల్లి ఏరియా గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయ ఆవరణలో శనివారం మాజీ కేంద్ర మంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన కార్యక్రమాలు, సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏబీటీయూసీ ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, ఎస్ఓ టూ జీఎం రాజమల్లు, ఏరియా ఇంజినీర్ భీంరావ్ జాడే, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఐఎన్‌టీయూసీ నాయకుడు శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫర్నీచర్ తయారీదారుల సమస్యలను పరిష్కరించాలి

- పీసీసీఎఫ్‌ను కోరిన ఆర్ఎస్పీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ, కోయవాగు గ్రామపంచాయతీలోని దాదాపు 500 కుటుంబాలు ఫర్నిచర్ తయారీపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని, వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు. శనివారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ కలిశారు. ఈ ఫర్నిచర్ తయారీదారులు మహారాష్ట్రలోని నాగపూర్ నుండి కట్టే మొదలైన ముడి సరుకులను దిగుమతి చేసుకొని ఫర్నిచర్ తయారు చేస్తుంటారని, స్థానిక ఫారెస్ట్ అధికారులు తమ దగ్గర సరైన ఆధార పత్రాలు లేవనే కారణంతో ఆ ఫర్నిచర్‌ను సీజ్ చేయడం, ఉత్పత్తిదారులను సరైన ధ్రువీకరణ పత్రాలు లేవంటూ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని సీసీఎఫ్ దృష్టికి తీసుకువచ్చారు. ఫర్నిచర్ ఉత్పత్తిదారులకు ఒక ప్రత్యేకమైన స్థలాన్ని ఏర్పాటు చేసి పనులు చేసుకోవడానికి వీలు కల్పిస్తామని, అదేవిధంగా బ్యాంకుల నుండి లోన్స్ ఇప్పించి, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారని ఆర్ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యామ్ రావు, మాజీ కౌన్సిలర్ నక్క మనోహర్, కౌన్సిలర్ మినాజ్, ఫర్నిచర్ ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీల్లో మెరిసిన జిల్లా జట్టు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నారాయణపేట జిల్లాలో జరిగిన పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-17 బాలబాలికల రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టు గోల్డ్ మెడల్ సాధించి మొదటి స్థానాన్ని పొందింది. ఎస్జీఎఫ్ కార్యదర్శి సాంబశివరావు వివరాలు వెల్లడిస్తూ సెమీఫైనల్‌లో వరంగల్ జట్టును ఓడించి ఫైనల్ చేరుకొని, కరీంనగర్ జిల్లా జట్టును ఓడించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని విజయ బేరి మోగించిందన్నారు. జట్టు కెప్టెన్‌గా వహించిన కవిత జట్టు విజయంలో ముందుండి నడిపించిన ఆసిఫాబాద్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు సత్యభామ, నందిని, అంజలి, కవిత, శిరీష, అనుష, జ్యోతికలను, కోతులు రాకేష్, సాయి, విశాలలను అభినందించారు. గోల్డ్ మెడల్ రావడం పట్ల జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యామ్ సుందర్ రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, గిరిజన ఆశ్రమ పాఠశాలల క్రిడాదికారి మీనా రెడ్డి, కోచ్ అరవింద్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ప్రశాంతమైన వాతావరణంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని కాగజనగర్ రూరల్ సీఐ కే.శ్రీనివాసరావు అన్నారు. శనివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో దుర్గా మాత మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుర్గామాత ప్రతిష్ఠించాలనుకునే వారు పోలీస్ స్టేషన్ నుండి అనుమతి తీసుకోవాలని, దుర్గామాత విగ్రహాల కమిటీ సభ్యులు పేర్లు అడ్రస్, ఫోన్ నంబర్లు పోలీసు స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. మండపాల వద్ద సత్ప్రవర్తన కలిగిన వాలంటీర్లను నియమించాలన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసిన వారు మండపాల వద్ద విధిగా ఒకటి లేదా రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్, ఈజ్‌గాం ఎస్ఐలు మహేందర్, రామాన్ కుమార్, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా రాణి దుర్గావతి జయంతి వేడుకలు

నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో గోండ్వాన రాజ్య స్థాపనకు వీరోచితంగా పోరాడిన వీర వనిత రాణి దుర్గవతి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి సేవలను కొనియాడారు. అనంతరం ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ రాణి దుర్గావతి గోండ్వానా రాజ్యాన్ని కాపాడేందుకు మొఘల్ చక్రవర్తి, అగ్బర్‌తో వీరోచితంగా పోరాడారన్నారు. ఆదివాసీ ఖ్యాతిని భారత దేశం నలుమూలల వ్యాపింపజేసిన రాణి దుర్గవతి చరిత్రని నేటి తరం వారికి అందించాలన్నారు. యువతీయువకులు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గొండ్వాన రాజ్యానికి సుపరిపాలన చేసి మొఘల్ రాజులతో యుద్ధం చేసి విజయం సాధించారని, ఆమె పరిపాలనలో బంగారం నాణేలు చలమని అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ మహిళలు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.



కాల్వకు మరమ్మతులు చేయించాలి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పొన్కల్ గ్రామ చెరువు కింద ఉన్న ప్రధాన కాలువకు బుంగలు పడడంతో లైనింగ్ పూర్తిగా చెడిపోయిందని ఆ గ్రామ రైతులు, శ్రీరాముల కొండయ్య సాంబారి మల్లయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుంగలుపడటంతో నీరు వృధా పోతుందని వెంటనే ఆ బుంగలను పూడ్చి నీరు వృధా కాకుండా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చూడాలని అధికారులను కోరారు. లేకుంటే చివరి ఆయకట్టు కింద ఉన్న రైతుల పంట పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు గంగన్న, సత్తన్న, భూమన్న, రాజన్న, లచ్చన్న, మల్లయ్య కొమురయ్య, రాజయ్య పాల్గొన్నారు.

క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయి : సీఐ

నవతెలంగాణ-తాండూర్



క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యంతో పాటు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని తాండూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కుమారస్వామి అన్నారు. శనివారం విద్యాభారతి బలగం ఆధ్వర్యంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. 1999 నుంచి 2012 వరకు పదవ తరగతి పూర్తి చేసిన 13 బ్యాచ్‌లకు పోటీలను విద్యాభారతి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు ఆగమరావు నిర్వహిస్తున్నారు. సీఐ కుమారస్వామి, ఎస్ఐలు కిరణ్ కుమార్ మాదారం ఎస్ఐ సౌజన్య పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

విద్యాశాఖ అధికారుల ఆదేశాలను పట్టించుకోని ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నస్పూర్ మండల ఉపాధ్యక్షుడు అరవింద్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నస్పూర్ మండలంలో పలు ప్రయివేటు విద్యాసంస్థలు 10వ తరగతి విద్యార్థులకు ట్యూషన్ పేరిట క్లాసులు నిర్వహిస్తున్నారని, విద్యార్థులను మానసికంగా ఇబ్బంది పెడుతూ, వారిని పిడిస్తున్నారన్నారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి 14వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినప్పటికి నస్పూర్ మండల ప్రయివేట్ విద్యాసంస్థలు క్లాసులు నిర్వహిస్తూ అధికారులు చెప్పిన ఆదేశాలను సైతం లెక్క చేయడం లేదని ఆరోయించారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రయివేట్ పాఠశాలలకు తప్పనిసరిగా దసరా సెలవులు ఇవ్వాలని, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ తమ ఉత్తర్వుల్లో పేర్కొన్నప్పటికి వాటిని తుంగలో తొక్కుతూ ఇష్టా రాజ్యాంగ వ్యవహరిస్తున్నారన్నారు. అంతేకాకుండా విద్యాశాఖ ఆదేశాలు పాటించకుండా కార్పొరేట్, ప్రయివేటు స్కూల్స్ నిర్వహిస్తున్న పాఠశాలలపై వెంటనే జిల్లాలోని ఉన్నత విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'ఎమ్మెల్యే నిర్ణయాలను స్వాగతిస్తున్నాం'



నవతెలంగాణ-మంచిర్యాల

ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా తీసుకున్న అక్రమ నిర్మాణాల తొలగింపు నిర్ణయాన్ని సీపీఐ నాయకులూ స్వాగతిస్తున్నామన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కేంద్రం కావడంతో చుట్టూ ప్రక్కల ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున మార్కెట్‌కు తరలి వస్తారని దాన్ని ఆసరాగా చేసుకున్న బడా వ్యాపారాలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికీ బిల్డింగ్ ముందు స్థలాన్ని కిరాయిలకు ఇవ్వడంతో మార్కెట్‌కు వచ్చే వారికీ నడవడానికి కూడా ఇబ్బందికరంగా మారింది అన్నారు. మాతాశిశు హాస్పిటల్ నిర్మాణాన్ని గోదావరి ఒడ్డున నిర్మాణం జరుగుతుంటే సీపీఐ అడ్డుకుందని అయినప్పటికీ అప్పటి ఎమ్మెల్యే అనాలోచిత నిర్ణయంతో మాత శిశు కేంద్రాన్ని గోదావరి ప్రాంతంలో నిర్మించారని, ఇప్పుడు అదే మాత శిశు ఆస్పత్రి ఐబిలో నిర్మాణం చేపడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నమన్నారు. పట్టణంలో అనుమతి కోసం సెల్లార్లు కట్టి అదే సెల్లార్లను అద్దెకు ఇచ్చి ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు ఎదురయ్యేలా చేస్తున్న బడా వ్యాపారులపై చట్టపరేనమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కళిందర్ అలీఖాన్, జిల్లా సమితి సభ్యులు చాడ మహేందర్‌రెడ్డి, కోడి వెంకన్న, నాయకులు బియ్యాల రాజేశం, మండ యాదగిరి, గాజుల రవికుమార్ పాల్గొన్నారు.

ఆంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం పరిశీలన



నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ ఆంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలం కెటాయిస్తున్నట్టు తహసీల్దార్ వనజారెడ్డి తెలిపారు. కాంగ్రెస్ నాయకులతో పాటు ఆంబేద్కర్ విగ్రహ కమిటి సభ్యులు, దళిత సంఘాల నాయకులు ఈ విషయమై శనివారం తహసీల్దార్‌ను కలిశారు. విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు అనువైన స్థలం కెటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ రెవెన్యూ కార్యాలయం సమీపంలో గల ప్రభుత్వ భూమి కెటాయిస్తున్నట్లు తెలిపారు. జాతీయ రహదారి నెంబర్ 63ను ఆనుకుని ఆంబేద్కర్ విగ్రహానికి అనువైన స్థలం కెటాయించడంతో కాంగ్రెస్ నాయకులతో పాటు ఆంబేద్కర్ విగ్రహ కమిటి సభ్యులు, దళిత సంఘాల నాయకులు తహసీల్దార్ వనజారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్స్ గడువు పొడిగింపు

నవతెలంగాణ-మంచిర్యాల

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేయాలనుకున్న అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు మంచిర్యాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓపెన్ డిగ్రీ చేసేందుకు, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిప్లమ పూర్తి చేసిన వారు అర్హులు ఓపెన్ డిగ్రీ ద్వారా బీఏ బీకామ్, బీఎస్సీ, బీజెడ్సీ, బీకమ్ జెనరల్, బీకామ్ కంప్యూటర్ కోర్సుల్లో చేరేందుకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాల కు మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని ఇతర వివరాలకు 738 2929719, 7780708354 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి కాకా వెంకటస్వామి



జైపూర్‌లో..

నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ కురువృద్ధుడు, సీడబ్ల్యూసీ మెంబర్, పెద్దపల్లి మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి బడుగు బలహీణవర్గాల ఆశాజ్యోతి అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కాక వెంకటస్వామి 95వ జయంతిని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలో వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాక వెంకటస్వామి దేశం గర్వించదగ్గ మహా నేత అని కొనియాడారు. ఆంబేద్కర్ ఆశయ సాధన కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. అదేవిదంగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ వివిధ కార్యాలయంల్లో, గ్రామ పంచాయతీల్లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ ఫయాజోద్దీన్, రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, చల్ల సత్యనారాయణరెడ్డి, చల్ల విశ్వంబర్‌రెడ్డి, పండుగ రాజన్న, బోయిని సంపత్, శీలం వెంకటేశం, కల్కి రమేష్ పాల్గొన్నారు.

భీమారంలో..

భీమారం మండల పరిషత్ కార్యాలయంతో పాటు గ్రామ పంచాయతీ, స్థానిక పోలీస్ స్టేషన్‌లో కాక వెంకటస్వామి 95వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కాక వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళు అర్పించారు. కేంద్ర మంత్రిగా పని చేసిన వెంకటస్వామి తెలంగాణ ప్రాంత అభివృద్ధి, పెద్దపల్లి పార్లమెంట్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారిని పలువురు కొనియాడారు.



భీమారం పోలీస్‌స్టేషన్‌లో..



తాండూర్‌లో..

జన్నారం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో, తహసీల్దార్ కార్యాలయంలో వేరువేరుగా పెద్దపెల్లి మాజీ ఎంపీ జి వెంకటస్వామి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ శశికళ, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి కాకా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన జయంతిలో మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గవర్నమెంట్ మాజీ ప్లీడర్ రత్నం రాజేష్ నేత పాల్గొన్నారు. కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారితోపాటు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బోర్లకుంట దీపక్ కుమార్ పాల్గొన్నారు.

తాండూర్ : మాజీ మంత్రి కాకా వెంకటస్వామి 95వ జయంతిని తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీఓ శ్రీనివాస్, సీఐ కుమారస్వామి కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సూరం రవీందర్‌రెడ్డి, గట్టు మురళీధర్, మాజీ జడ్పీటీసీ బానయ్య్ మాజీ ఎంపీటీసీ సిరంగి శంకర్, రత్నాకర్, పేరం శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు రహమత్ ఖాన్, మోస వెంకటస్వామి, పుట్ట శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిజిటల్ కార్డు సర్వే నివేదిక స్పష్టంగా ఉండాలి

- ప్రత్యేక అధికారి, రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ కె.ఇలంబర్తి



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు సర్వే నివేదిక స్పష్టంగా రూపొందించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రత్యేక అధికారి, రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ కె. ఇలంబర్తి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ సర్వే నిర్వహణపై ఆర్డీఓలు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, సర్వే బృందాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు సర్వే నివేదిక ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా ఉండాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో సందేహాలు, పొరపాట్లు ఏమైనా ఉంటే నివృత్తి చేసుకొని స్పష్టమైన నివేదిక రూపొందించాలని తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాత ఈ నెల 9వ తేదీన వివరాలను పరిశీలించి నిర్దీత ప్రొఫార్మాలో పొందుపరిచి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఒక కుటుంబానికి ఒక కార్డు ఉంటుందని, కుటుంబంలోని ప్రతి సభ్యుడికి ఒక ప్రత్యేక నంబర్ కేటాయించడం జరుగుతుందని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అన్నింటికీ ఒకే కార్డు అనుసంధానమై ఉంటుందని తెలిపారు. అన్ని వర్గాల వారి నుంచి వివరాలు సేకరించాలని, కుటుంబంలో వయస్సు రీత్యా పెద్దవారైన మహిళను కుటుంబ పెద్దగా నిర్ణయించి మిగిలిన వారిని ఆ వ్యక్తితో కలిగిన సంబంధంతో సహా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. బృందం సభ్యులకు అందించిన జాబితా ప్రకారం పేర్లు, వివరాలు సరి చూసుకోవాలని, మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లు నిబంధనల ప్రకారం తొలగించి, నూతనంగా వచ్చిన వారి పేర్లు నమోదు చేయాలని, ఉమ్మడి కుటుంబంలో పెళ్లి అయిన వారు ఉంటే వేరుగా నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పైలెట్ ప్రాజక్టు సర్వేపై ప్రజలకు తెలిసే విధంగా టాం-టాం, ప్రచార విధానాల ద్వారా విస్తత ప్రచారం నిర్వహించి, సర్వే సమయంలో అందుబాటులో ఉండేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు రాములు, హరికష్ణ, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివద్ధి అధికారులు బంద సభ్యులు పాల్గొన్నారు.

లాభాల వాటాను సవరించాలి : హెచ్ఎంఎస్



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి మొత్తం రూ.4701 కోట్లపై లాభాల వాటా 33 శాతం రూ.1551 కోట్లను కార్మికులకు చెల్లించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. శనివారం హెచ్ఎంఎస్ మందమర్రి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాస్తవ లాభాలు రూ.4701 కోట్లు సింగరేణి సంస్థనే ప్రభుత్వం ముందు ప్రకటించినప్పటికి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు మొత్తం లాభాల వాటా ఇవ్వాలని ప్రతిఘటించకపోవడం కార్మిక ద్రోహంగా భావిస్తున్నామన్నారు. మొత్తం లాభాలపై 33 శాతం అంటే రూ.1551 కోట్లు ఇవ్వలేదని, గతంలో ఇలా ఎప్పుడూ జరగలేదన్నారు. సింగరేణి విస్తరణకు అంటూ థర్మల్ విద్యుత్, సోలార్ అని మాయ మాటలు చెప్పి కార్మికుల సొమ్ము రూ.2281 కోట్లను తీసుకుంటే గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఛోద్యం చూస్తున్నాయని అన్నారు. కార్మికులకు ఇచ్చే 33 శాతం కాకుండా మిగిలిన 67 శాతంతో విస్తరణ, థర్మల్, సోలార్ పనులు చేసుకోవచ్చని దీన్ని అడ్డుకోకుండా ఏదో సాధించామని సంకలు గుద్దుకోవడం సింగరేణి కార్మికులకు ద్రోహం చేయడమేనని అన్నారు. ఎన్నడూ లేని విధంగా సఘం డబ్బులు ప్రక్కన పెట్టి మిగతా రూ.2420 కోట్లకు మాత్రమే 33శాతం ఇవ్వడం తప్పని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ నారాయణ, మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ జె శ్రీనివాస్, కేంద్ర నాయకులు వెల్ది సుదర్శన్, బోనాల శ్రీనివాస్, ఎర్ర శ్రీనివాసరెడ్డి, చొప్పరి రామస్వామి పాల్గొన్నారు.

కళాశాలల్లో బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబరాల ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినిలు బతుకమ్మలు పేర్చి కళాశాల ముందు ఆడి పాడారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ముత్యం సతీష్ మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలన్నారు. విద్యార్థులతో కళాశాల యాజమాన్యం బతుకమ్మ పాటలతో ఆడి పాడారు.

మందమర్రి : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినిలచే బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాలకి ఆదివారం నుంచి సెలవులు కావడంతో శనివారం తీరొక్క పూలతో నానబియ్యం బతుకమ్మలను పేర్చి, గౌరమ్మలను తయారుచేసి బతుకమ్మ ఆడారు. కళాశాల ప్రాంగణం పండగ వాతావరణాన్ని తలపించింది. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ దేవతలను పూలతో పూజిస్తారని అదే పూలను దేవతలుగా పూజించే గొప్ప సంస్కృతి మనదని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యాపకులు చంద్రకళ, అనిత, అమెరున్నిసా పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం

నవతెలంగాణ-జన్నారం

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం జరుగుతుందని బీసీ ఉద్యమ పోరాట సమితి ఖానాపూర్ నియోజకవర్గ కన్వీనర్ ఒల్లాల నర్సాగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 5 శాతం లేని ఈడబ్ల్యూఎస్ వాళ్లకు 10 శాతం రిజర్వేషన్ కేటాయించడం సరికాదన్నారు. దీంతో బీసీలకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. రిజర్వేషన్ల కోటా ఫిక్స్ చేయకుండా 10 శాతం రిజర్వేషన్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందని ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుతో ఇటీవల డీఎస్సీలో అగ్రవర్ణాలకు చెందిన 100 మందికి రావలసిన ఉద్యోగాలు 1100 మందికి వచ్చాయని ఐదు శాతం జనాభా లేని ఈ డబ్ల్యూఎస్ వర్ణాల వాళ్ళకు 10 శాతం ఎలా అమలు చేస్తారని వారు ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం తెచ్చిన ఈ డబ్ల్యూ ఎస్ కోటాను తమిళనాడులో అమలు చేయడం లేదని ఈ డబ్ల్యూ ఎస్ వారికి రిజర్వేషన్లు కల్పించడం వలన మెరిట్ తెచ్చుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందన్నారు.

పట్టభద్రులు ఓటరు జాబితాలో చేరాలి



నవతెలంగాణ-మంచిర్యాల

రాజకీయాలను శాసించే సత్తా ఉన్న యువతకు ఓటు వజ్రాయుధమని, ప్రతి ఒక్క పట్టభద్రులు వారి ఓటు నమోదు చేసుకోవాలని బీఎస్ రావు హెల్త్ ఫౌండేషన్ చేర్మన్ డాక్టర్ బి.ఎస్.రావు అన్నారు. ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, కరీంనగర్ పట్టా బద్రుల ఎమ్మెల్సీగా బరిలో నిలువనున్న ఆయన శనివారం జిల్లా కేంద్రంలో ఓటరు అవగాహనపై పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఐఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పట్టభద్రులంతా వారి హక్కుగా ఓటును పొందాలన్నారు. నేనొక్కడినే ఓటు వేయకుంటే ఏమి కాదులే అనే నిర్లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ వీడాలన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో సమూలమైన మార్పులు రావలసిన అవసరం ఉందని యువత సహా విద్యావంతుల పక్షాన బలంగా గొంతుక వినిపించే ఒక మంచి నాయకుడిని ఎమ్మెల్సీగా ఎన్ను కోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా గ్రంథాలయం ఆవరణలోనూ యువతతో మాట్లాడుతూ ఓటరు నమోదును ఆన్‌లైన్ ధరఖాస్తు ఎలా చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఐఎంఏ సభ్యులు, వైద్యులు, యువత పాల్గొన్నారు.

8న ఫ్యామిలీ డే ఆటాపాట సంబరాలు

నవతెలంగాణ-మందమర్రి

ఫ్యామిలీ డే ఆట పాట సంబరాలను విజవంతం చేయాలని ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్యామిలీ డే ఆట పాట సంబరాలను అక్టోబర్ 8 సిఈఆర్ క్లబ్‌లో సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఏరియా జీఎం దేవేందర్, గౌరవ అతిథిగా సేవ అధ్యక్షురాలు స్వరూపరాణి హాజరవుతారాని తెలిపారు. ఫ్యామిలీ డే ఆటపాట కార్యక్రమంలో గ్రూప్ డాన్సు చేసేవారు 8 మందికి మించరాదన్నారు. ఉత్తమ బతుకమ్మలు, ఆటల పోటీలలో గెలుపొందినవారికి మొదటి, రెండవ, మూడవ బహుమతులు ఇస్తామని తెలిపారు. మహిళా ఉద్యోగులు, ఉద్యోగుల భార్యలు వారి పిల్లలు, సేవా సమితి సభ్యులు, లేడీస్ క్లబ్ మెంబర్స్, పట్టణ పరిసర గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రెజ్లింగ్‌లో సత్తా చటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని ఇందన్పల్లి జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పి సహస్ర రెజ్లింగ్‌లో మూడవ స్థానంలో నిలిచి కాంస్య పథకాన్ని సాధించిందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, పీడీ శివ నూరి తిరుపతి తెలిపారు. శనివారం నారాయణపేట జిల్లాలో ఈ నెల 3 నుంచి ఐదవ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో మూడవ స్థానంలో నిలిచి కాంస్య పథకాన్ని సాధించిందని తెలిపారు. రెజ్లింగ్లో ప్రతిభ కనబరిచిన పి సహస్రను, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ మాదాడి సరోజన, మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీ ఖాన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్ సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షులు జాడి గంగాధర్ అభినందించారు.

పర్సనల్ విభాగం అధికారులతో సమీక్ష

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా వివిధ గనులు, విభాగాలలో పనిచేస్తున్న సంక్షేమ అధికారులతో డీజీఎం పర్సనల్ పి.అరవిందరావు శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద రావు మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమంలో ప్రతి ఒక్క సంక్షేమ అధికారి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని, శ్రీరాంపూర్ ఏరియాలో పదవి విరమణ పొందిన, అనారోగ్య సమస్యలతో మెడికల్ ఇన్వాల్యుయేషన్ అయినా ఉద్యోగులకు సంబంధించిన అన్ని సెటిల్మెంట్లను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. 11వ వేజ్ బోర్డ్‌కు సంబంధించి పెరిగిన పెన్షన్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని, 2024-25 సంవత్సరానికి గాను పదోన్నతులకు సంబంధించిన ప్రతిపాదనలను కంపెనీ నియమనిబంధనలకు అనుగుణంగా పంపించాలని, అలాగే ఎన్సీడబ్ల్యూఏ ఉద్యోగులను బదిలీ వర్కర్ నుంచి జనరల్ మజ్దూర్ అండర్ గ్రౌండ్ ప్రమోషన్స్ త్వరితగతిన పూర్తి చేసి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, డీవై పీఎం రాజేశ్వర రావు, సీనియర్ పీఓలు కాంతారావు, రణదీప్‌గౌడ్, శంతన్, సురేందర్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
ఆదిలాబాద్
5
ఆదివారం | అక్టోబర్ 06, 2024 | www.navatelangana.com

పురుగులమందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

నవతెలంగాణ-కౌటాల



పురుగులమందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కోయగూడా గ్రామంలో జరిగింది. ఎస్ఐ ఎన్ మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్లే పోచయ్య(75) ఒకటవ తేదిన వృద్ధాప్య పెన్షన్ రావడంతో ఆ రోజు నుండి అధికంగా మద్యం తాగి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం పురుగులమందు తాగాడు. కడుపులో మంటతో కేకలు వేయడంతో కుమారుడు కిషన్ వెళ్లి చూడగా నోటి నుండి నురుగులు రావడంతో పురుగుల మందు తాగాడని తెలుసుకొని వెంటనే సిర్పూర్-టి సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుండి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతిని కుమారుడు కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేయాలి

● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో వ్యవసాయ రంగ కార్మికుల శాఖ మహాసభలు నిర్వహించారు. ముందుగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లంక రాఘవులు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల కూలి రేట్లను పెంచాలని, జాతీయ ఉపాధి హామీ పనులు 200 రోజులకు పెంచాలని, కనీస కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, స్వామి, ఆశన్న, మంజుల, కిరణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను బద్నాం చేస్తే ఊరుకోం

● అక్రమ మొరం తవ్వకాలపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

డబుల్ బెడ్ రూమ్ ఏరియాలో జరుగుతున్న అక్రమ మొరం తవ్వకాలను శనివారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం, పార్టీ మండలాధ్యక్షుడు దొనికెని దయానంద్, నాయకులు నిమ్మల రమేష్, తోట సత్యం, షబ్బీర్ పాషా, శేషాద్రి, రాజేందర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ స్థలంలో రాత్రి సమయంలో అక్రమంగా మొరం తవ్వుతున్నారని అన్నారు. ఈ తవ్వకాలకు ఎమ్మెల్యే పేరును సోషల్ మీడియాలో పనిగట్టుకొని ప్రచారం చేయడం సరికాదని అన్నారు. ఎమ్మెల్యేకు, కాంగ్రెస్ నాయకులకు డబ్బులు ఇచ్చి తవ్వకాలు చేస్తున్నట్లు కొందరు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. అక్రమ మొరం రవాణ చేస్తున్నట్టు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని తెలిపారు. మొరం తవ్వకాలకు పాల్పడుతున్న ఎంతటి వారినైనా వదిలిపెట్టమని హెచ్చరించారు. తవ్వకాలపై జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ నియమాలు దాటి మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

విజయదశమి ఉత్సవాలకు ఏర్పాట్లు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఈనెల 12న నిర్వహించనున్న విజయదశమి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆలయంలో విజయదశమి వేడుకల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయదశమి రోజున ఆలయంలో ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు, సాయంత్రం 5 గంటలక షమీవృక్ష పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయదశమి వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అలయ కమిటి ప్రతినిధులు పిన్న వివేక్, గడ్డల వెంకటేషం, ఏకీరాల శ్రీనివాస్, చిలుకూరి రాధాకృష్ణ చారి, ఇరుకుల్ల సుధాకర్, డాక్టర్ రమేష్, వనం మధుకర్, నారాయణ మూర్తి, లక్ష్మణ మూర్తి, నరసింహ స్వామి, కృపాల్, బెతూ తిరుపతి పాల్గొన్నారు.

జెఎన్‌వీలో ప్రవేశానికి దరఖాస్తులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయం(జెన్‌వీ)లో 2025-26 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, 2025 ఫిబ్రవరి 8న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జిల్లాలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పూలను దేవతగా పూజించే తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ ఆసిఫాబాద్ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు యోగేష్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అటవీశాఖ అధికారి సతీమణి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇతర రాష్ట్రానికి చెందిన ఆమె తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను తెలుసుకొని అభినందించారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారిణీలు సరోజరాణి, ఝాన్సీ లక్ష్మి, సంఘం జాయింట్ సెక్రెటరీ స్వప్న, సిబ్బంది వనిత, శ్రీలేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

చైతన్య కళాశాలలో..

చైతన్య కళాశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సాయిని రాజశేఖర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

సోయా కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

రైతులు సోయా కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మార్కెట్ యార్డ్‌లో సోయాబీన్ కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పండించిన ప్రతి సోయా గింజను కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.4895 పొందాలని తెలిపారు. కొనుగోలు సందర్భంలో మార్కెట్ యార్డ్‌కు వచ్చే రైతుకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మండల నాయకులు తిరుమలగౌడ్, నిమ్మల శివకుమార్‌రెడ్డి, వెంకటేష్, ప్రవీణ్, గణేష్ పాల్గొన్నారు.

గిరిజన హాస్టల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

● యూనియన్ రాష్ట అధ్యక్షులు టేకం ప్రభాకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్‌లలో పనిచేస్తున్న డైలీవేజ్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టేకం ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం డీటీడీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాల(హాస్టల్)లలో పని చేస్తున్న డైలీవేజ్, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం, వర్కర్లకు కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. వేసవి సెలవులలో వేతనాలు చెల్లించాలని కోరారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెలిశాల క్రిష్ణమాచారి మాట్లాడుతూ కార్మికులలో ఎవరైనా అనారోగ్య బారిన పడితే ఆరోగ్యం మెరుగయ్యే వరకు కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వాలన్నారు. భీం వర్ధంతి వేడుకల్లో పాల్గొనే ప్రతి కార్మికునికి రూ.1000 అలవెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. జోడేఘాట్ వెళ్లడానికి అవసరమైన రవాణా సౌకర్యం కార్మికులకు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, ప్రజా సంఘాల నాయకులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు అరిగేల కోటయ్య, నాయకులు విక్రమ్ పాల్గొన్నారు.

ఆదర్శ హాస్టల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆదర్శ హాస్టల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. శనివారం కార్మికులు సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా చాలిచాలని వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. 24 గంటలు విద్యార్థులకు అందుబాటులో ఉంటూ పనిచేస్తున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా సెలవులు తీసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఇంత పని చేస్తున్నప్పటికి 8 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బడ్జెట్ వచ్చిన వేతనాలు చెల్లించలేని పరిస్థుతులలో జిల్లా అధికార యంత్రాంగం ఉందన్నారు. వీరికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు, ఉద్యోగ భద్రత లేనటువంటి పరిస్థితి ఉందన్నారు. శ్రమను గుర్తించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకొగా జిల్లా అధ్యక్షురాలుగా ఆత్రం పార్వతీ, ఉపాధ్యక్షులుగా చంద్రభాను, రేఖా, జాధవ్ కవితా, జిల్లా కార్యదర్శిగా శ్రీకొండ సంగీతా, సహాయక కార్యదర్శులుగా గెడాం భాగిరథ, బొమ్మెన కవితా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, అమృత, సుమలత పాల్గొన్నారు.



అంబేద్కర్ భావాలు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



అంబేద్కర్ భావాలు క్షేత్రస్థాయిలోకి తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందని భారతీయ బౌద్ధ మహారాష్ట్ర కమిటీ ఆర్గనైజర్, బుద్ధిష్ట్ పర్సనల్ లా రాష్ట్ర అధ్యక్షుడు మధు బావుల్కర్ అభిప్రాయపడ్డారు. శనివారం జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమిలో బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహల్కార్ అధ్యక్షతన నిర్వహించిన భారతీయ బౌద్ధ మహాసభల జిల్లా బాధ్యుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధిష్ట పర్సనల్ లా ప్రస్తుతం అవసరమన్నారు. దీనిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని కోరారు. రాజ్యాంగంపై దేశంలో అక్కడక్కడ జరుగుతున్న దాడులను తిప్పి కొట్టాలని, రాజ్యాంగ అవసరాన్ని క్షేత్రస్థాయిలో వివరించాలన్నారు. బుద్ధగయ బౌద్ధ దేవాలయం విముక్తి ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలని సూచించారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి విస్తారు, ఉపాధ్యక్షులు వినీష్, ఉప్రే(సంస్కార్), తుకారాం చున్నార్కర్, కోశాధికారి తిరుపతి దుర్గం, జిల్లా నాయకులు శ్యామ్‌రావు, మనోహర్ ముంజం, బాపు జాడే, ఆత్మ రాం, దొంగ్రే రమేష్, జగ్తప్, ప్రేం కుమార్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అదనపు గదులు ప్రారంభం

● ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని లింగి గ్రామంలోని సాయి వృద్ధాశ్రమంలో కొత్తగా నిర్మించిన అదనపు గదులను శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రారంభించారు. వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి, గౌరవించాలని కోరారు. ఆరోగ్యం, భోజనం వసతులు, వైద్యమందించాలని కోరారు. ఏమైనా వసతులు లేనట్లయితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల కోసం ప్రయత్నిస్తానన్నారు. వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు దెబ్బడి అశోక్ పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, లింగి చిరునామతో ఆధార్ కార్డు అడ్రస్ మారిస్తే పింఛన్ ఇప్పించేందుకు సుముఖంగా ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం తరపున వైద్య శిబిరం ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అనంతరం వృద్ధాశ్రమ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వృద్ధులకు బట్టలు పంపిణీ చేశారు. గ్రామస్తులు గ్రామ సమీపంలోని వంతెన నిర్మాణం గూర్చి అడగగా మంజూరుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు దెబ్బడి అశోక్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ శేఖర్, డిబ్యూఓ సబిత, ఏసీడీపీఓ మిల్కా, పొచ్చన్న, అశోక్, వినోద్, శివన్న, ఏపీఎం స్వామి, ఏపీఓ మేఘమాల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లీకేజీ సరి చేయరు.. నల్లాలు రావు..!

● తప్పని తాగు నీటి కటకట

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం వేరసి పట్టణంలోని శ్రీరాంనగర్ ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ కాలనీ వాసులకు సమీప గోదావరి తీరంలో ఉన్న ఎల్లమ్మ బావి నుంచి నీరు సరపరా అవుతుంది. పైపులైను లీకేజీ కావడంతో స్థానికులు నీటికోసం ఇబ్బంది పడుతున్నారు. సమస్య చిన్నదే అయినప్పటికీ రిపేరు చేయడంలో అధికారులు, పాలక సభ్యులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దుర్గా నవరాత్రుల సమయంలో ఇలా నీటి సమస్య నెలకొనడాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. లీకేజీ సరి చేయాల్సిన పైపులైన్ నిర్వాహకులు రిపేరు పని చేయకున్నా చేసినట్లుగా ప్రజలను నమ్మిస్తూ తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎప్పుడో ఓ సారీ లీకేజీ సమస్య ఎదురైందంటే పోనీలే అనుకోవచ్చు. కాని నెలలో ఐదారుసార్లు పైపులైన్ లీకేజీ అవుతూ నల్లాలు రాకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు, పాలకులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేనేమి చేయాలి

భీమేష్, నల్లాల నిర్వాహకుడు



లీకేజీ అవుతున్న పైపు లైను బాగు చేయాలని, రెండు రోజుల కింద చెప్పాను. పైపు లైన్ పని చేసేవాళ్ల దానిని సరిచేయకున్నా చేసినట్లు చెప్పారు. మోటార్ స్టార్ట్ చేస్తే నీరంతా బావి వద్దనే పోతుంది. ప్రజలు నన్ను తిడుతున్నారు.

మూడు రోజుల నుంచి నీళ్లు రావడం లేదు

కాలేరి సుజాత, శ్రీరాంనగర్



నల్లాలకు మూడు రోజుల నుంచి నీళ్లు వస్తలేవు. పైపు లైను సరి చేశామని అన్నారు. నీళ్లు మాత్రం వస్తలేవు. ఇతర చోటు నుంచి నీళ్లు తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉంది. ఉత్సవాల సమయంలో నల్లాలు సరిగా రాకుంటే కష్టంగా ఉంటది. అధికారులు పట్టించుకోవాలి.

క్రీడాకారులు క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా క్రీడల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సీనియర్స్ హాకీ శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి హైదరాబాద్‌లో సీనియర్స్ హాకీ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ ప్రారంభం అవుతుందన్నారు. అందులో భాగంగా స్టేడియంలో శిక్షణ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. హాకీలో ఆదిలాబాద్ క్రీడాకారులు మంచి ప్రదర్శనలు ఇస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో జరిగే టోర్నమెంట్ కప్ లక్ష్యంగా ఆడి గెలవాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తు మంచి నైపుణ్యాలను ప్రదర్శించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడాల అభివృద్ధి అధికారి పార్ధసారథి, డేవిడ్ రాజ్, రవీందర్, శ్రీను, శేఖర్, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

17న కుమురంభీం వర్ధంతిని విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 17న ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో నిర్వహించే కుమురంభీం వర్ధంతిని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని తన క్యాంపు కార్యాలయంలో కుమురంభీం వర్ధంతికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ నినాదంతో నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు కుమురంభీం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుమురంభీం వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. ఈ వర్ధంతి సభకు రాష్ట్ర నలుమూలల నుంచి ఆదివాసీలు, మేధావులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుమురంభీం మనవడు కుమురం సోనేరావ్, లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, మంగీ మాజీ సర్పంచ్ కోట్నాక్ గణపతి, మాజీ సర్పంచ్ పెందూర్ కళావతి, కమిటీ సభ్యులు కుమురం మాధవ్, కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అంగరంగవైభవంగా దుర్గాదేవికి పూజలు

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలో దుర్గాదేవి నవరాత్రులు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సేవాదాస్‌నగర్‌లో శనివారం దుర్గాదేవిని గాయత్రి దేవిగా భక్తులు అలంకరించారు. పాత ఉట్నూర్, శ్యాంపూర్, హస్నాపూర్, లక్కారం, నాయక్‌నగర్‌లలో దేవి విగ్రహాలను ప్రతిష్టించి, ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు భక్తులు ఉపవాసాలు ఉంటూ, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు.

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు

● ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నవతెలంగాణ-ఇచ్చోడ

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని గాంధీ నగర్ గ్రామ సమీపంలో ఎన్‌హెచ్ 44 నుంచి బొరిగామ గ్రామం మీదుగా కామగిరి వరకు నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.10 లక్షలతో ప్రహరి గోడ నిర్మాణానికి భూమిపూజ చేసి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రూ.1 కోటి 80 లక్షలతో చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని అన్నారు. పల్లెలు అభివృద్ధి చెందితేనే, పట్టణాలు, రాష్ట్రాలు, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని అన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి, బీటీ రోడ్డు, సీసీ రోడ్లు వేసిన సందర్భాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, సురేందర్‌రెడ్డి, తిరుమల్‌గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, గణేష్, వెంకటేష్, ప్రవీణ్, రషీద్ పాల్గొన్నారు.